క్లుప్తంగా

బీజేపీ ఎన్నికల ప్రచారం



పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ మండలం మిర్దాపల్లి, రాంపూర్ గ్రామాల్లో శనివారం బీజేపీ నాయకుడు పైడి రాకేష్ రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాకేష్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో అవినీతి పాలనకు స్వస్తి పలకాలంటే రాబోయే ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిని గెలిపించాలని ప్రజలను కోరారు. నాయకులు కొత్తూరు గిరీష్, రోహిత్ రెడ్డి, పాలెపు రాజు, సుచరితరెడ్డి పాల్గొన్నారు.

వినయ్‌రెడ్డి విజయం సాధించాలి



పెర్కిట్(ఆర్మూర్): రానున్న శాసనసభ ఎన్నికల్లో వినయ్‌రెడ్డి విజయం సాధించాలని మంత్రి శనిగరం సంతోష్‌రెడ్డి ఆకాంక్షించారు. పెర్కిట్‌లోని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పొద్దుటూరి వినయ్‌రెడ్డి ఇంట్లో శనివారం నిర్వహించిన తేనీటి విందుకు సంతోష్‌రెడ్డి హాజరయ్యారు. ఈసందర్భంగా సంతోష్‌రెడ్డి మాట్లాడుతూ.. వినయ్‌రెడ్డి గెలుపు కోసం పార్టీ శ్రేణులు కృషి చేయాలని సూచించారు. నాయకులు రమేష్‌రెడ్డి, వెంకటేష్, రవికాంత్‌రెడ్డి, సాయిబాబాగౌడ్, భాజన్న, లక్ష్మీ నారాయణ పాల్గొన్నారు.

రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌దే విజయం



ఎడపల్లి(బోధన్): రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ ఘనవిజయం సాధిస్తుందని జెడ్పీ వైస్ చైర్మన్ రజితయాదవ్, మండల అధ్యక్షుడు శ్రీరామ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో శనివారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. అభివృద్ధిని చూసి, ప్రజలే బీఆర్‌ఎస్‌కు ఓట్లు వేసి గెలిపించనున్నారన్నారు. ఈనెల 26న ఎడపల్లిలో నిర్వహించబోయే సద్దుల బతుకమ్మకు ఎమ్మెల్సీ కవిత రానున్నట్లు తెలిపారు. సర్పంచులు భాస్కర్‌రెడ్డి, సావిత్రి రవీందర్‌గౌడ్, ఆకుల శ్రీనివాస్, ఎంపీటీసీలు షేక్ జావిద్, స్రవంతి పోతన్న, విండో చైర్మన్‌లు పోల మల్కారెడ్డి, సత్యనారాయణ, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

అవకాశం ఇవ్వండి.. గెలిచి చూపిస్తా..



వర్ని: బాన్సువాడ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థిగా తనకు టికెట్ కేటాయిస్తే భారీ మెజార్టీతో గెలిచి చూపిస్తానని వర్ని మాజీ ఎంపీపీ సంఘం శ్రీనివాస్‌గౌడ్ వెల్లడించారు. మండల కేంద్రంలో శనివారం విలేకరులతో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఉద్యమం సమయంలో జరిగిన ఉప ఎన్నికల్లో పోటీ చేసి అత్యధిక ఓట్లు సాధించానని, కార్యకర్తలకు, నాయకులకు, ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేయడం మూలంగానే ఎన్నికల్లో తనకు ప్రజలు ఆశీర్వదించారని గుర్తు చేశారు. పార్టీ అధిష్టానం తనకు టికెట్ కేటాయించాలని కోరారు.

బీజేపీ నాయకుల సంబురాలు



కమ్మర్‌పల్లి: బీజేపీ బాల్కొండ నియోజకవర్గ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే ఏలేటి అన్నపూర్ణ పేరును ప్రకటించడంతో శనివారం మండల కేంద్రంలో పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తూ, సంబురాలు నిర్వహించారు. టపాసులు కాల్చి, స్వీట్స్ పంచిపెట్టారు. నాయకులు కట్ట సంజీవ్, గంగారాం, వెంకట్‌రెడ్డి, అరుణ్, గంగాధర్ పాల్గొన్నారు.

మంత్రి ప్రశాంత్‌రెడ్డికి పరామర్శ



వేల్పూర్: రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి ప్రశాంత్‌రెడ్డి తల్లి మంజులమ్మ ఇటీవల అనారోగ్యంతో మరణించింది. దీంతో శనివారం మంత్రిని పలువురు ప్రజాప్రతినిధులు వేల్పూర్‌లోని ఆయన నివాసంలో పరామర్శించారు. రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, మాజీ మంత్రులు శనిగరం సంతోష్‌రెడ్డి, మండవ వెంకటేశ్వరరావు, ఎస్సీ కమిషన్ సభ్యుడు ప్రవీణ్, బాజిరెడ్డి జగన్, డీసీఎంఎస్ చైర్మన్ సాంబారి మోహన్, ఇతర నాయకులు మంజులమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు.

దుర్గమ్మా.. సల్లంగ సూడమ్మా..



బోధన్‌లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న మహిళలు



ఆర్మూర్‌లో చండీయాగం నిర్వహిస్తున్న భక్తులు



రెంజర్లలో బోనాలతో శోభాయాత్ర



జన్నేపల్లి గ్రామంలో దుర్గామాత తెప్పోత్సవంలో పాల్గొన్న మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే హన్మంత్‌రావ్



ముప్కాల్‌లో..



హున్సా గ్రామంలో...



రుద్రూర్‌లో అమ్మవారి చీరలకు వేలం నిర్వహిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

సాక్షి నెట్‌వర్క్: శరన్నవరాత్రి ఉత్సవాలు ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గాల్లో వైభవంగా కొనసాగుతున్నాయి. ఆయా గ్రామాల్లోని అమ్మవారి మండపాల్లో శనివారం కుంకుమార్చనలు, అన్నదానాలు, ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. చిన్నారులు, యువతీయువకులు, మహిళలు దాండియాతో సందడి చేశారు. రుద్రూర్‌లోని చౌడేశ్వరి దేవి ఆలయంలో ఆలయ మహిళ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారి చీరల వేలంపాట ఏర్పాటు చేశారు. ముప్కాల్ మండలం రెంజర్ల గ్రామంలో దుర్గమ్మకు భక్తులు వల గొడుగుతో బోనాలను సమర్పించారు. అనంతరం దుర్గామాత మండపం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అలరించిన తెప్పోత్సవం

నవీపేట మండలంలోని జన్నేపల్లి గ్రామంలో నిర్వహించిన దుర్గామాత తెప్పోత్సవంలో మల్కాజ్ గిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్ రావ్ పాల్గొన్నారు. దుర్గామాత ఉత్సవ విగ్రహానికి ఊరేగింపు నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.



బోధన్‌లో అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు



హున్సా గ్రామంలో అన్నదానం నిర్వహిస్తున్న ఎంపీఆర్ ఫౌండేషన్ సభ్యులు

ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి



ధర్నా నిర్వహిస్తున్న రైతు కూలీ సంఘ సభ్యులు

రెంజల్(బోధన్): మండలంలో సోయా, ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు శనివారం రెంజల్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. పలువురు నాయకులు మాట్లాడుతూ.. అధికారుల నిర్లక్ష్యం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పది రోజుల నుంచి సోయా, వరి పంటల కోతలు ఊపందుకున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు పంటను దళారులకు విక్రయించి తీవ్రంగా నష్టపోతున్నారని వివరించారు. అనంతరం తహసీల్దార్ రాంచందర్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకులు పుట్టి నాగన్న, నసీర్, రాజేశ్వర్, పెద్దులు, పోశెట్టి, సంతోష్, మల్లేష్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో బీఆర్‌ఎస్ విఫలం



బోధన్‌టౌన్(బోధన్): ప్రజల సమస్యలను పరిష్కరించడంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం విఫలమైందని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. పట్టణంలోని పలు వార్డుల్లో శనివారం పార్టీ నాయకులు ఇంటింటికీ బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. పట్టణంలోని వార్డుల్లో మౌలిక వసతులు కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమయ్యిందని ఆరోపించారు. ఒక్కసారి బీజేపీకి అవకాశం ఇచ్చి చూడండని ప్రజలను కోరారు. నాయకులు వడ్డి మోహన్‌రెడ్డి, కొలిపాక బాలరాజు, మేక సంతోష్ పాల్గొన్నారు.

బంగారు బతుకమ్మ ఉయ్యాలో..





మోస్రాలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు.. అమ్రాద్‌లో చంద్రయాన్ ఆకారంలో పేర్చిన బతుకమ్మ

వర్ని/వేల్పూర్/మాక్లూర్: మోస్రా, మాక్లూర్ మండలాల్లో బతుకమ్మ పండుగ సంబురాలు శనివారం ఘనంగా కొనసాగాయి. ఈసందర్భంగా మహిళలు తీరొక్క పువ్వులతో బతుకమ్మలను అందంగా పేర్చారు. అనంతరం బతుకమ్మలను ఇంటి ముంగిట, గ్రామ చావిడి వద్ద ఉంచి యువతులు, మహిళలు బతు కమ్మ ఆడారు. డీజే పాటలతో బతుకమ్మ ఆడుతూ, నృత్యాలు చేస్తూ ఆడిపాడారు. మాక్లూర్ మండలంలోని అమ్రాద్ గ్రామంలో చంద్రయాన్ ఆకారంలో పేర్చిన బతుకమ్మ ఆకట్టుకుంది.



పచ్చలనడ్కుడలో 25 అడుగుల బతుకమ్మ

వేల్పూర్ మండలం పచ్చలనడ్కుడ గ్రామంలో గురడిరెడ్డి సంఘం ఆధ్వర్యంలో 25 అడుగుల బారీ బతుకమ్మను ఊరేగించి, నిమజ్జనం చేశారు.

బీఆర్‌ఎస్ పాలనలో అభివృద్ధి శూన్యం



బోధన్‌టౌన్(బోధన్): రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి శూన్యమని కాంగ్రెస్ నాయకులు అన్నారు. పట్టణంలోని 4వ వార్డులో శనివారం వారు కాంగ్రెస్ పథకాలను ప్రజలకు ప్రచారం చేశారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. నాయకులు పాషా మోయినొద్దీన్, హరికాంత్ చారి, నవీన్, దాము, సాయిలు, హన్మంత్‌రావ్, ఆదినారాయణ, చిరంజీవి, హైమద్, మున్నా, రిజ్వాన్ ఉన్నారు.

బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక



వేల్పూర్: మండలంలోని పడగల్ గ్రామానికి చెందిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీల కార్యకర్తలు శనివారం బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. వారికి మంత్రి ప్రశాంత్ రెడ్డి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్‌ఎస్‌లో చేరిన యువకులకు మంత్రి ధన్యవాదాలు తెలిపారు.

నవీపేట: మండలంలోని హనుమాన్‌ఫారం గ్రామానికి చెందిన పలువురు నాయకులు శనివారం బీఆర్‌ఎస్‌లో చేరారు. నాయకులు రాంకిషన్‌రావ్, నర్సింగ్‌రావ్, అల్లం రమేష్ పాల్గొన్నారు.

డీఈవోకు వినతి

నిజామాబాద్‌అర్బన్: ప్రభుత్వం విద్యార్థుల అల్పాహారానికి రూ.25 చెల్లించాలని ఏఐటీయూసీ నాయకులు డీఈవో దుర్గాప్రసాద్‌కు శనివారం వినతి పత్రం అందజేశారు. కార్మికులకు కనీస వేతనం, మెనూ చార్జీలు పెంచకుండా కార్మికుల ఇంటి నుంచి డబ్బులు తెచ్చి విద్యార్థులకు వండి పెట్టమనడం దుర్మార్గమని అన్నారు. అల్పాహారానికి రూ. 25 చెల్లించాలని కోరారు.

ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించండి



సీహెచ్ కొండూర్‌లో ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి



ఆర్మూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

నందిపేట్(ఆర్మూర్): ఆర్మూర్ నియోజక ప్రజల అభ్యున్నతి కోసం జీతగాడిలా పనిచేస్తానని, రాబోయే ఎన్నికల్లో తనను మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి అన్నారు. నమస్తే నవనాథ పురం కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని సీహెచ్ కొండూర్ గ్రామంలో ఆయన ప్రజా ఆశీర్వాద యాత్ర నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కేసీఆర్ ఆశీర్వాదాలతో ఆర్మూర్ నియోజకవర్గంలో రూ. వేల కోట్లతో అభివృద్ధి చేశానని పేర్కొన్నారు.

ఎన్నికల ప్రచారాన్ని అడ్డుకున్న మాలధారులు..

ప్రచార కార్యక్రమాల్లో భాగంగా చౌడేశ్వరీ ఆలయం వద్ద ఎమ్మెల్యే పూజలు చేసి, ప్రజలకు అభివాదం చేస్తుండగా దుర్గాదేవి మాలధారులు ప్రచారాన్ని అడ్డుకున్నారు. ఆలయం వద్ద ప్రచారం ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించారు. గన్‌మెన్ అడ్డుకోబోగా తమను షర్టుగల్ల పట్టుకున్నారని మాలధారులు ఆందోళన చేశారు. దీంతో ఎమ్మెల్యే అక్కడి నుంచి వెళ్లిపోయారు. సర్పంచ్ ప్రభాకర్, ఎంపీటీసీ రాజు, మాజీ సర్పంచు దేవిదాసు, బోగన్న, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నవనాథ సిద్దులగుట్టపై గల నవనాథ సిద్దేశ్వర పిరమిడ్ ధ్యాన మహాశక్తి క్షేత్రం వద్ద శనివారం ధ్యాన బతుకమ్మ సంబురాలను నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మట్లాడుతూ.. ధ్యానం ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. క్షేత్ర నిర్వాహకులు సాయికృష్ణారెడ్డి, తిరుమల గంగారాం, దయానంద్, శేఖర్‌రెడ్డి, శ్రీనివాస్, పోశెట్టి, ముత్యం, సంతోష్, గంగాధర్, రాజన్న, ఉన్నారు.

పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ మండలం రాంపూర్, మిర్దాపల్లి గ్రామాల్లో శనివారం నిర్వహించిన ప్రజా ఆశీర్వాద యాత్రలో ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అవకాశవాద కాంగ్రెస్ నిజ స్వరూపాన్ని ప్రజలు గ్రహించాలన్నారు. సీఎం కేసీఆర్ పాలనలో బంగారు తెలంగాణగా రూపుదిద్దుకుంటున్న రాష్ట్రంలో మళ్లీ కాంగ్రెస్ వస్తే సంక్షోభం ఏర్పడుతుందని అన్నారు. సర్పంచ్‌లు బంటు దయానంద్, సొడ సాయిలత మధువర్మ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లండి



బీఆర్‌ఎస్‌లో చేరిన యువకులతో ఎమ్మెల్యే షకీల్

బోధన్: సీఎం కేసీఆర్ ప్రకటించిన బీఆర్‌ఎస్ ఎన్నికల మేనిఫెస్టోతో పాటు బీఆర్‌ఎస్ ప్రభుత్వం సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే షకీల్ పార్టీ శ్రేణులకు సూచించారు. పట్టణంలోని తన స్వగృహంలో శనివారం సాలూర మండలంలోని మందర్న సర్పంచ్ గంగాధర్ ఆధ్వర్యంలో గ్రామస్తులు, యువకులు భారీ సంఖ్యలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తన గెలుపే లక్ష్యంగా ముందుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపు నిచ్చారు. బీఆర్‌ఎస్ కుటుంబ సభ్యులను, నియోజకవర్గ ప్రజలను కంటి రెప్పలా కాపాడుకుంటానని పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మంత్రి ప్రశాంత్‌రెడ్డికి మద్దతుగా తీర్మానం

భీమ్‌గల్: మండలంలోని పల్లికొండ గ్రామం మాదిగ సంఘ సభ్యులు శనివారం మంత్రి ప్రశాంత్‌రెడ్డి రాబోయే ఎన్నికల్లో మద్దతు ప్రకటించారు. ఈసందర్భంగా బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి ప్రశాంత్ రెడ్డికి పూర్తి మద్దతుగా ఉండాలని నిర్ణయం తీసుకున్నారు. తీర్మాన కాపీ ని ఐఏహెచ్‌ఎఫ్‌డబ్ల్యూ చైర్మన్ మధుశేకర్‌కు అందజేశారు. ఈ సమావేశంలో మాదిగ సంఘం సభ్యులు పాల్గొన్నారు.



నియామకం



బాల్కొండ: బీసీసంక్షేమ సంఘం మెండోరా మండల అధ్యక్షుడిగా మండలంలోని చాకీర్యాల్ గ్రామానికి చెందిన ఆరేపల్లి గంగాధర్ నియమితులయ్యారు. ఈమేరకు శనివారం ఆయనకు నియోజకవర్గ అధ్యక్షుడు నేల్లా లింగన్న నియామక పత్రం అందజేసి, సన్మానించారు. నాయకులు ద్యాగా శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అయోడిన్ లోపాన్ని అధిగమించాలి

రుద్రూర్: ప్రతి ఒక్కరు అయోడిన్ కలిగిన ఉప్పును వినియోగించి అయోడిన్ లోపాన్ని అధిగమించాలని కోటగిరి మండల ఆరోగ్య విస్తరణ అధికారి గోవర్ధన్ సూచించారు. రుద్రూర్ మండలం చిక్కడపల్లి గ్రామంలో శనివారం అయోడిన్ లోప రుగ్మతల దినోత్సవాన్ని పురస్కారించుకుని స్థానికులకు అయోడిన్ లోపం వల్ల కలిగే నష్టాలను ఆయన వివరించారు. ఆరోగ్య కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న హెచ్ఈవో గోవర్ధన్

నాణ్యమైన పెట్రోల్ విక్రయించాలి

బోధన్‌టౌన్(బోధన్): పట్టణ శివారులోని ఓ పెట్రోల్ బంక్ వద్ద శనివారం నాణ్యమైన పెట్రోల్‌ను విక్రయించాలని మహిళలు నిరసన వ్యక్తం చేశారు. బంక్‌లో కల్తీ పెట్రోల్‌ను విక్రయిస్తున్నారని ఆరోపించారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి బంక్ సిబ్బందిపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

నగరంలో వైద్య శిబిరం

నిజామాబాద్ సిటీ: నగరంలో ని పాలిటెక్నిక్ మైదానంలో శనివారం కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యులు పలువురికి షుగర్, బీపీ, ఇతర ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. అలాగే కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలో అందుతున్న సేవల గురించి ప్రజలకు వివరించారు. డివిజన్ మేనేజర్లు, బ్యాంక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లీష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	టైగర్ నాగేశ్వరరావు(తెలుగు) - 9.40. భగవంత్‌కేసరి(తెలుగు) - 4.10 లియో(తెలుగు) - 10.30
స్క్రీన్-2 –	లియో(తెలుగు) - 11.15, 2.40, 6.05, 9.30
స్క్రీన్-3 –	భగవంత్ కేసరి (తెలుగు) - 11.55, 3.20, 6.45, 10.10
స్క్రీన్-4 –	టైగర్ నాగేశ్వరరావు (తెలుగు)-11.15, 2.50, 6.25, 10.00

సంక్షిప్తం

ఉత్తమ విద్యార్థులకు పురస్కారాల ప్రదానం



పెర్కిట్(ఆర్మూర్): పెర్కిట్‌లో శనివారం జిల్లా దేవాంగా విద్య కమిటి ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలను అందజేశారు. ఈసందర్భంగా విద్యార్థులకు నగదు పారితోషకంతో పాటు జ్ఞాపికలను అందజేశారు. రిటైర్డు ఐఏఎస్ అధికారి చిరంజీవులు, కమర్షియల్ టాక్స్ డిపార్టుమెంట్ రిటైర్డు అసిస్టెంటు కమిషనర్ చౌళ రాజేశ్వర్, జిల్లా కమిటి సభ్యులు పాల్గొన్నారు.

ఓంకార్‌కు ఘన నివాళి

బోధన్: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు, ఎంసీపీఐ(యూ) వ్యవస్థాపకుడు, అమరుడు మద్దికాయల ఓంకార్‌కు పార్టీ నాయకులు ఘన నివాళులు అర్పించారు. పట్టణంలో శనివారం ఓంకార్ 15 వ వర్ధంతి సందర్భంగా పార్టీ నేతలు ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన పోరాటాలను కొనియాడారు. నాయకులు అనిల్‌కుమార్, సంగీత, శోభ, సన్నీ, వినోద్, రాజు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత



బోధన్: పట్టణంలోని హనుమాన్‌టేకిడి కాలనీకి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు రవిరాజు కొన్నేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. బాధిత కుటుంబానికి శనివారం ఎమ్మెల్యే షకీల్ రూ. 50వేల ఆర్థిక సహాయం అందించారు. ఎమ్మెల్యే సతీమణి, అయేషా వెల్ఫేర్ సొసైటీ చైర్మన్ అయేషా ఫాతిమా, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

సీఎస్ఐ చర్చిలో వన్‌డే యూత్ రీట్రీట్ ...

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని సీఎస్ఐ చర్చిలో శనివారం వన్‌డే యూత్ రీట్రీట్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా యువకులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం పలు పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు.

కేసీఆర్, షకీల్ గెలవాలని యువకుడి పాదయాత్ర

బోధన్: బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్, ఎమ్మెల్యే షకీల్ రాబోయే ఎన్నికల్లో మళ్లీ గెలవాలని కోరుతూ సాలూర మండలంలోని తగ్గెలి గ్రామానికి చెందిన రఘుపతి సంతోష్ అనే యువకుడు శనివారం సారంగపూర్ హనుమాన్ మందిరం వరకు పాదయాత్రగా వెళ్లాడు. ఆయనను బీఆర్‌ఎస్ నాయకులు బుద్దె రాజేశ్వర్, సొసైటీ చైర్మన్ అల్లె జనార్ధన్, మాజీ ఉపసర్పంచ్ డిస్కో సాయిలు అభినందించారు.